క్లుప్తంగా

వెల్లాల పార్వతీదేవికి పూజలు



రాజుపాళెం: ప్రత్యేక అలంకరణలో పార్వతీదేవి

రాజుపాళెం : మండలంలోని పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలోని భీమలింగేశ్వర స్వామి ఆలయంలో ఉన్న పార్వతీదేవికి మాఘమాసం సందర్భంగా ఆదివారం అర్చకుడు వెంకటాచలపతి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే మల్లె, జాజి, కనకాంబరం పూలు, 303 నిమ్మకాయలు వేసి అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. అమ్మవారిని నంద్యాల జిల్లా డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్న జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ హెచ్.వెంకటసుబ్బయ్యలను ఆలిండియా కళా రంగం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివారం స్థానిక మైదుకూరు రోడ్డులోని ఎస్ఎంఎస్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆలిండియా కళా రంగం జిల్లా అధ్యక్షులు రవితేజ మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ మరోవైపు కళాకారులకు సహకరిస్తూ కళలను ప్రోత్సహిస్తున్న అధికారులను సన్మానించుకోవడం బాధ్యత అని అన్నారు. అనంతరం జిల్లా అధికారులు మాట్లాడుతూ కళాకారులు తమ కళా నైపుణ్యాన్ని భావితరాలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో బద్దెన కళాపీఠం అధ్యక్షులు సాంబశివారెడ్డి, కళా రంగం ఉపాధ్యక్షులు పోలిరెడ్డి, కోశాధికారి గురివిరెడ్డి, కార్యవర్గ సభ్యులు సూర్యశేఖర్‌రాజు, చెంచురెడ్డి, నారాయణరెడ్డి, జనవిజ్ఞాన వేదిక నాయకులు చింతంరెడ్డి రామచంద్రారెడ్డి, రెడ్డి సేవా సంఘం ఉపాధ్యక్షులు వెంకటసుబ్బారెడ్డి, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షులు పి.వి.రమణ పాల్గొన్నారు.

ట్రోఫీ విన్నర్స్‌గా ప్రొద్దుటూరు డాక్టర్స్ టీం



విన్నర్స్‌గా నిలిచిన ప్రొద్దుటూరు డాక్టర్స్ టీం

చాపాడు : స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో ఆదివారం జరిగిన ఐడీపీఎస్ చైర్మన్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రొద్దుటూరు డాక్టర్స్ టీం విన్నర్స్‌గా నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన డాక్టర్స్ టీం 10 ఓవర్లలో 120 రన్స్ చేయగా ఇందులో డాక్టర్ నిరంజన్‌రెడ్డి 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 39, డాక్టర్ ప్రదీప్ 30 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన సీబీఐటీ టీం 10 ఓవర్లలో 82 పరుగులే చేయగా డాక్టర్స్ టీం 38 పరుగుల తేడాతో విజయం సాధించి విన్నర్స్‌గా నిలిచింది. ఇదే క్రమంలో ఉదయం జరిగిన మ్యాచ్‌లలో ఐడీపీఎస్ టీచర్స్ పైన డాక్టర్స్ టీం గెలువగా, ఐడీపీఎస్ పేరెంట్స్ టీఎంపై సీబీఐటీ టీంలు గెలిచి ఫైనల్ మ్యాచ్‌లో తలబడ్డాయి. విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచిన టీఎం సభ్యులను ఐడీపీఎస్ చైర్మన్ వి.జయచంద్రారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐడీపీఎస్ డైరెక్టర్ లోహిత్‌రెడ్డి, సీబీఐటీ ప్రిన్సిపాల్ డా.జి.శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

గ్రామంలోని సమస్యలను పరిష్కరిస్తా

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ఈద్గా భూమి పూజ సందర్భంగా మత పెద్దలతో కలసి ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు : కొత్తపల్లె గ్రామంలోని సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామంలో సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటా తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం వలంటీర్ల ద్వారా నేరుగా ఇంటికే సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. అర్హతగల వారుంటే కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీరు అందడం లేదని, శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని, రోడ్లను నిర్మించాలని ప్రజలు కోరారు. ఎమ్మెల్యే సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, వార్డు మెంబర్లు సోనిదీపిక, లక్ష్మీనారాయణరెడ్డి, తాటి లక్ష్మీదేవి, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉపేంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి గురుమోహన్, ట్రాన్స్‌కో ఏఈ నరసింహారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరత్‌రెడ్డి, ఏఓ శివశంకర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అమృతానగర్‌లో..

కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని అమృతానగర్ 4వ సచివాలయం పరిధిలో సోమవారం ఉదయం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి తెలిపారు.

ఈద్గా నిర్మాణానికి సహకరిస్తా

ప్రొద్దుటూరు : ఈద్గా నిర్మాణానికి అన్ని విధాలా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులో ఖాతున్‌బి - మహబుమియ్యా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఖాజి సయ్యద్‌హాజి హబిబుల్లా నిర్మించనున్న ఈద్గా నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇండస్ట్రియల్ డిపార్ట్‌మెంట్ పరిధిలో ఉన్న ఈద్గా నిర్మాణ స్థలానికి ప్రభుత్వం నుంచి అనుమతులు తెప్పిస్తానన్నారు. ఖాజి సయ్యద్‌హాజీ హబీబుల్లా సామాజిక సేవలో భాగంగా 64 సెంట్ల తన సొంత స్థలంతోపాటు రూ.15లక్షలు ఇవ్వడం అభినందనీయమన్నారు. సమావేశంలో ముస్లిం మత పెద్దలు మహ్మద్ అబ్దుల్ ఖాదర్ ఖాద్రి, ముఫ్తి సయ్యద్ అహమ్మద్, ముస్లిం సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఖాజామొహిద్దీన్, ప్రధాన కార్యదర్శి ఎస్.ఫరీద్ బాషా, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, కౌన్సిలర్లు ఇర్ఫాన్ బాషా, కమాల్ బాషా, మహమ్మద్ గౌస్, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, ఆటోనగర్ అసోసియేషన్ అధ్యక్షుడు నన్నే సాహెబ్ మార్కెట్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

అట్లూరు : జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ కె.హమీదా బేగం, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మురళీక్రిష్ణలు పేర్కొన్నారు. ఫిబ్రవరి 13వ తేదీ వరకు గ్రామాల్లో కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. చర్మంపై స్పర్శలేని రాగిరంగు మచ్చలు, చర్మం పొడిగా ఉండటం, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, మందమైన జిడ్డుగల చర్మం, అరచేతులు, అరికాళ్ళు స్పర్శ కోల్పోవడం, చేతి, కాలు వేళ్ళు వంకరలు తిరిగి ఉండటం, కాళ్ళకు చెప్పులు జారి పోవడం తదితర లక్షణాలు ఉంటే వైద్య పరీక్షలు తప్పనిసరి అని తెలిపారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన

ప్రొద్దుటూరు కల్చరల్ : జార్జి కారొనేషన్ క్లబ్‌లో ఆదివారం రాత్రి నందనందన శతక ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన నాటక ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. శ్రీకృష్ణ చాతుర్యం, మాయల పక్కీర్ ఏకపాత్రాభినయం, మయసభ ఏకపాత్రాభినయం, భారతంలో భీముడు ఏకపా త్రాభినయం, రాధా బిల్వ మంగకుల సన్నివేషా లు, రామాంజనేయుల సమరం, బాలనాగమ్మ కార్యవర్థుల వనవిహారం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ప్రతిష్టాత్మకంగా గడప గడపకు కార్యక్రమం



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి

బద్వేలు : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన పోరుమామిళ్లలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారని, దాదాపు 120 రోజులు పైగా ఈ కార్యక్రమం పూర్తయిందన్నారు. ప్రజల నుంచి వచ్చిన అనేక సమస్యలను అప్పటికప్పుడే పరిష్కారం దిశగా కృషి చేస్తున్నామని చెప్పారు. చిన్నపాటి సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయం చేసుకుని రోజుల వ్యవధిలోనే పరిష్కరిస్తున్నారని తెలిపారు. పెద్ద సమస్యలను ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు ముందుకు సాగుతున్నామన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతి పంచాయతీకి నిధులు కేటాయించిందన్నారు. సోమవారం నుండి కాశినాయన మండలంలో గడప గడపకు కార్యక్రమం ప్రారంభిస్తున్నామని తెలియజేశారు. నరసాపురంలో జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. సమావేశంలో మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కె.రమణారెడ్డి, నరసాపురం నాయకులు హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

బద్వేలు అర్బన్ : ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులను ఆదివారం ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి పరామర్శించారు. మున్సిపాలిటీ పరిధిలోని కోటిరెడ్డినగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చెన్నకృష్ణారెడ్డి కుమారుడు అజయ్‌సింహారెడ్డి, అశోక్‌నగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు లారీ నరసింహారెడ్డి, గుంతపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఐ.ఎస్.ఆర్.నాయుడులను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పశ్చిమ కన్వీనర్ యద్దారెడ్డి, కలసపాడు మాజీ జెడ్పీటీసీ భూపాల్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు పుత్తాశ్రీరాములు, ప్రతాప్‌కుమార్, నారాయణరెడ్డి, లక్ష్మీనరసయ్య, కౌన్సిలర్ ఓబుల్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చంద్రహాసరెడ్డి పాల్గొన్నారు.

సాహిత్యాభిమానాన్ని పెంపొందించుకోవాలి

- కవి, దర్శకుడు అక్కిరాజు సుందర రామకృష్ణ
- ఘనంగా నందనందన శతకావిష్కరణ



నందనందన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు, ప్రముఖులు

ప్రొద్దుటూరు కల్చరల్ : తెలుగు సాహిత్యాభిమానాన్ని పెంపొందించుకోవాలని కవి, దర్శకుడు అక్కిరాజు సుందర రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక జార్జి కారొనేషన్ క్లబ్‌లో ఆదివారం విశ్రాంత ఈఈ. ఎం.రామసుబ్బారెడ్డి రచించిన నందనందన శతకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచయిత ఇంజినీరు అయినా పద్యంలో మంచి కృషి చేసి పట్టు సాధించి, పదవీ విరమణ అనంతరం చక్కటి పద్యాలతో శతకాన్ని రచించారన్నారు. శతక కవులు వేమన, బద్దెన వంటి కవులు పుట్టిన ఈ ప్రాంతంలో వారి ప్రేరణతో నందనందన శతకంలో పద్యాలతో పాటు తాత్పర్యసహితంగా ముద్రించడం అభినందనీయమన్నారు. కవి చక్రాల లక్ష్మీకాంతరాజారావు శతకంలోని పద్యాలు చక్కటి ఇతి వృత్తంతో నందననందుని వర్ణించే విధంగా ఔచిత్యంతో పద్యాలు రచించారన్నారు. కందపద్య సార్వభౌమ డాక్టర్ రాధశ్రీ మాట్లాడుతూ రామసుబ్బారెడ్డి గతంలో రెండు పుస్తకాలను నాటకాలపై రచించారని, ప్రస్తుతం శతకాన్ని రచించారన్నారు. 80 ఏళ్ల వయసులో శతకాన్ని రచించడం గొప్పవిషయమని, ఇది ఆయనకు గల సాహితీ అభిమానాన్ని తెలియచేస్తోందని కొనియాడారు. శతక గ్రంథకర్త రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ తనకు చిన్నతనం నుంచి సాహిత్యం అంటే ఎనలేని అభిమానమన్నారు. తాను రచించిన నందనందన శతకాలను ప్రతి ఒక్కరూ చదవాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ 80 ఏళ్ల వయసులో సాహితీ అభిమానంతో శతకాన్ని రచించడం రామసుబ్బారెడ్డికి ఉన్న సాహితీ అభిమానాన్ని తెలియచేస్తోందన్నారు. డాక్టర్ డి.నాగదస్తగిరిరెడ్డి, సీపీ సాధు గోపాలకృష్ణ, పుట్టపర్తి సాహితీ పీఠం అధ్యక్షుడు జింకా సుబ్రహ్మణ్యం, మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపకుడు గానుగపెంట హనుమంత రావు, కార్యనిర్వాహకులు బాలగంగిరెడ్డి, గంగిరెడ్డి, చదువులబాబు, వెంకటేశ్వరరెడ్డి సాహితీ వేత్తలు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యంపై శిక్షణ

మైదుకూరు : యువతకు ఉజ్వల భవిష్యత్తు అందించేందుకు సాంకేతిక నైపుణ్యంపై శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున, మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన రెండో దశ శిక్షణ, ఉపాధి కోర్సుల్లో భాగంగా ఈ శిక్షణ ఇస్తున్నట్లు వారు తెలిపారు. మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీకాలేజీలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, రీటైల్ సేల్స్ అసోసియేట్ కోర్సులకు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. మూడు నెలల శిక్షణకు 18 నుంచి 28 ఏళ్లలోపు ఉన్న యువతీ యువకులు శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్‌నంబర్లకు 9701801902, 9398348760 సంప్రదించాలని సూచించారు.

1న ఆలయ వార్షికోత్సవం



కొలువైన సాయినాథుడు

గోపవరం : మండలంలోని టి.సండ్రపల్లె పంచాయతీ బుచ్చనపల్లె గ్రామంలోని షిరిడీ సాయినాథ్ మహరాజ్ ఆలయ 3వ వార్షికోత్సవ మహోత్సవం ఫిబ్రవరి 1వ తేదీ బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కూకట్లపల్లి నారాయణ, వారి ధర్మపత్ని వెంకమ్మలు తెలిపారు. బుధవారం ఉదయం 6 గంటలకు కాగడ హారతి, పంచామృతాభిషేకం, కలశాభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి, సాయంత్రం 6 గంటలకు సంధ్యాహారతి, రాత్రి 7 గంటలకు పల్లకీ సేవ, 10 గంటలకు శేజాహారతి ఉంటుందన్నారు. రాత్రి 8 గంటలకు కూకట్లపల్లి పూర్వీహరిప్రసాద్‌చే భరతనాట్యం, నెల్లూరు వారి పాటకచ్చేరి కార్యక్రమాలుంటాయని తెలిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వార్షిక మహోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం బలవంతపు భూ సేకరణ ఆపాలి



ఎక్స్‌ప్రెస్ హైవే కొలతలు వేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

చాపాడు : గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం బలవంతపు భూ సేకరణ ఆపాలని, భూ నిర్వాసిత రైతులకు న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ద్వారకానగరం గ్రామంలో గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు పోతున్న రైతుల పంట పొలాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులు తమకు పరిహారం బహిరంగ మార్కెట్‌లో ఎకరా రూ.2 కోట్లు ఉందని, ప్రభుత్వం ఇస్తున్న నష్ట పరిహారం కనీసం ఎకరాకు రూ.కోటి అయినా ఇస్తేనే భూములు ఇస్తామని ఆ గ్రామ రైతులు రైతు సంఘం నాయకుల దృష్టికి తెచ్చారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో సర్వీస్ రోడ్లు నిర్మించాలని ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, మైదుకూరు సీపీఎం మండల కార్యదర్శి షరీఫ్, నాయకులు సుబ్బరాయుడు, రాయప్ప, రైతులు పాల్గొన్నారు.

• నీరు నిండుగా.. పైరు పండగా..



వెలవలి-తొండలదిన్నె గ్రామాల మధ్యలో కుందూనదిలో పారుతున్న నీరు



కుందూ సమీపంలో పచ్చగా ఉన్న నారుమడి

రాజుపాళెం : కుందూతీర ప్రాంతంలోని రైతులు రెండో పంటగా వరి పంటను సాగు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. కుందూనదిలో నీరు పారుతుండటంతో నదితీరం వెంట ఉన్న గ్రామాల్లోని రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట నూర్పిళ్లు పూర్తయ్యాయి. వెంటనే రైతులంతా నారుకయ్యలు వేశారు. ఖరీఫ్ సీజన్‌లో వరి పంట దిగుబడి, ధర ఆశాజనకంగా ఉండటంతో తిరిగి రెండో పంటగా వరినే వేస్తున్నారు. కోటి ఆశలతో రెండో పంటసాగుకు సిద్ధం అయ్యామని అక్కడి రైతులు చెబుతున్నారు.

• విస్తారంగా దోస సాగు



కొండ్రాజుపల్లెలో మల్చింగ్ వేసి సాగు చేస్తున్న దోస పంట

కాశినాయన : మండలంలోని రైతులు దాదాపు 150 ఎకరాల్లో దోస పంటను సాగు చేస్తున్నారు. బోరుబావుల కింద ఎక్కువగా అరటి పంటను సాగు చేసేవారు. అరటి పంటకు తెగుళ్ళు ఎక్కువ కావడం, ధరలు పడిపోతుండటంతో రైతులు దోస సాగుపై దృష్టి సారించారు. మల్చింగ్ పేపరు వేసి సాగు చేస్తున్నారు. ఎకరా దోస పంటను సాగు చేయాలంటే దాదాపు రూ.20 వేలు పెట్టుబడి పెడుతున్నారు. ప్రస్తుతం ధర ఆశాజనకంగా ఉండటంతో రైతులు దీనిపై మొగ్గు చూపుతున్నారు. అలాగే కొంత మంది రైతులు మల్చింగ్ పేపరు లేకుండానే దోస పంటను సాగు చేస్తున్నారు. అంతే కాకుండా 70 రోజుల్లో పంట కోతకు వస్తుంది. ఒకసారి మల్చింగ్ వేస్తే మూడు పంటలు వేసుకోవచ్చని రైతులు అంటున్నారు.

• పచ్చదనపు పరవళ్లు



తిమ్మారెడ్డిపల్లె వద్ద సాగు చేసిన సజ్జ పంట

బద్వేలు : పోరుమామిళ్ల వ్యవసాయ డివిజన్ పరిధిలోని పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు మండలాల్లో సాగు చేసిన మొక్కజొన్న, సజ్జ పంటలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ఈ మండలాల్లో ఫౌండేషన్ సీడ్ సాగు చేస్తున్నారు. దాదాపు 10 వేల ఎకరాల్లో సజ్జ, మొక్కజొన్న పంటలు ఉన్నాయి. గత మూడేళ్లుగా చెరువులు తెలుగుగంగ జలాలతో కళకళలాడుతున్నాయి. బోర్లన్నీ భూగర్భ జలాలతో సంవృద్ధిగా ఉన్నాయి. దీంతో సాగు చేసిన పంటలు పచ్చదనపు పరవళ్లతో రైతుల్లో ఆశలు నింపుతున్నాయి.

లక్ష్మీకాంత రాజారావుకు మొల్లసాహితీ సేవా పురస్కారం ప్రదానం



మొల్లసాహితీ సేవా పురస్కారం అందుకుంటున్న చక్రాల లక్ష్మీకాంతరాజారావు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శతావధాని నరాల రామారెడ్డి సాహితీ కార్యాలయంలో ఆదివారం హైదరాబాదుకు చెందిన పద్యకవి, ఛందస్సు నవ్యసాచి విద్వాన్ చక్రాల లక్ష్మీకాంత రాజారావుకు మొల్లసాహితీసేవా పురస్కారం ప్రదానం చేశారు. మొల్ల సాహితీ పురస్కారం, నగదు పారితోషికం, శాలువవ, జ్ఞాపికను ఆయనకు అందజేశారు. లక్ష్మీకాంత రాజారావు చేసిన సాహితీ సేవకు గాను ఈ పురస్కారాన్ని అందించినట్లు పీఠం వ్యవస్థాపకుడు గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో రచయిత జింకా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ధరలు మోదం.. దిగుబడులు ఆశాజనకం..

- ఎకరాకు 7 నుంచి 11 క్వింటాళ్ల దిగుబడులు
- క్వింటాల్ రూ.7వేలు నుంచి రూ.8 వేలు వరకూ కొనుగోళ్లు
- మమ్మురంగా నూర్పిళ్లు.. విక్రయాలు.. నిల్వలు..





చాపాడు మండలంలో మినుము పంట నూర్పిడి, మినుములు

చాపాడు : గతేడాది సాగైన పంటలు అధిక దిగుబడి ఇవ్వడంతో పాటు ధరలు కూడా ఆశాజనకంగా ఉన్నాయి. పంట సాగు చేసి నష్టాలు లేకుండా లాభాలతో గట్టెక్కుతున్నారు. ఖరీఫ్‌లో సాగైన వరి పంటల దిగుబడులు, ధరలు రైతును ఊరించగా.. ఇదే బాటలో మినుము పంట దిగుబడులు పెరిగి.. ధరలు ప్రభుత్వ గిట్టుబాటు మద్దతు ధర కన్నా అధికంగా ఉన్నాయి.

సాగు ఖర్చులు తక్కువనే ఉద్దేశ్యంతో రైతులు ఈ రబీలో మినుము సాగుపై ఆసక్తి కనబరిచారు. దీంతో రైతు ఊహించినట్లుగా దిగుబడులు పెరగగా ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. జిల్లాలో 17వేల ఎకరాలకు పైగా మినుము సాగవగా గత రెండు వారాల నుంచి పంట నూర్పిళ్లు మమ్మురంగా జరుగుతున్నాయి. గతేడాది 6 వేల ఎకరాలు మాత్రమే మినుము సాగవగా ఈ సారి మూడింతలు సాగు పెరిగింది.

పెరిగిన దిగుబడులు.. ఊరిస్తున్న ధరలు..

విక్రయాలు.. నిల్వలు..

రబీలో రైతులు సాగు చేసిన మినుమ పంట దిగుబడులు ఆశాజనంగా ఉన్నాయి. దిగుబడులు పెరగటంతో పాటు ధరలు కూడా ఊరించటంతో మినుము సాగు చేసిన రైతులకు లబ్ధి చేకూరనుంది. జిల్లాలో ప్రొద్దుటూరు, రాజుపాళెం, మైదుకూరు, చాపాడు, ఖాజీపేట, జమ్మలమడుగు, పెద్దముడియం, వేముల, ఎర్రగుంట్ల, దువ్వూరు, ముద్దనూరు, పెండ్లిమర్రి, కమలాపురం, చింతకొమ్మదిన్నె, కొండాపురం, వేముల, వేంపల్లె, చక్రాయపేట ఇంకా పలు మండలాల్లో అధికంగా మినుము సాగైంది. గత రెండు వారాల క్రితం నుంచి మినుము పంట నూర్పిళ్లు మమ్మురంగా జరుగుతున్నాయి. ఎకరాకు సాధారణంగా గతేడాది వరకూ 5-7 క్వింటాళ్లు కాగా ఈ ఏడాది 7-11 క్వింటాళ్ల వరకూ దిగుబడులు వస్తున్నాయని రైతులు అంటున్నారు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాళ్ రూ.6,600లు ఉండగా వ్యాపారులు మాత్రం దీని కంటే ఎక్కువ ధరలకు మినుము పంటను కొనుగోలు చేస్తున్నారు. క్వింటాల్ రూ.7వేల నుంచి వివిధ ప్రాంతాల్లో రూ.8వేల వరకూ వ్యాపారులు పోటీ పడి కొనుగోళ్లు చేస్తున్నారు. అయితే ప్రతి 50 కేజీల బస్తాపై వ్యాపారులు 2 కిలోల పైగా మినుములు అదనంగా తీసుకుంటున్నారు. ధరలు బాగున్నాయనే క్రమంలో రైతులు కూడా మినుమును పంటను విక్రయించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. 50 కిలోల బస్తాలలో రైతుల మినుములను నిల్వలు చేసుకుంటున్నారు. పంట సీజన్ ముగిస్తే ధరలు మరింత పెరుగుతాయనే కారణంతో రైతులు మినుములను నిల్వ చేసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

మినుము పంటను నిల్వ చేస్తున్నాను



రబీలో ఆరు ఎకరాల్లో మినుము సాగు చేశాను. నాతో పాటు మా గ్రామంలో 150 ఎకరాల వరకూ మినుము సాగైంది. ఎకరాకు 8 క్వింటాళ్ల పైగా దిగుబడులు వచ్చాయి. మా చుట్టు పక్కల గ్రామాల్లో 11 క్వింటాళ్లు కూడా దిగుబడి వచ్చింది. గతంలో ఐదు క్వింటాళ్లు మాత్రమే వచ్చేది. ఈ ఏడాది పెరిగింది. ధరలు కూడా బాగుండటంతో మినుములను నిల్వ చేయనున్నాము.

- సీవీ సుబ్బారెడ్డి, రైతు, అనంతపురం, చాపాడు మండలం

5 ఎకరాల్లో మినుము సాగు



వరికి ప్రత్యామ్నాయంగా మినుము పంటను ఐదేకరాల్లో సాగు చేశాను. దిగుబడులు బాగానే వచ్చాయి. క్వింటాల్ రూ.7వేలతో విక్రయించాము. గతంలో వేరు శనగ సాగు చేసేవాడిని, ఈ సారి మినుము సాగుపై ఆసక్తితో సాగు చేశాను. ఆశాజనకంగానే దిగుబడి రాగా, ధరలు కూడా రైతులకు మేలు చేసేలా ఉన్నాయి.

-ముచ్చుమర్రి రాజశేఖర్, తిప్పిరెడ్డిపల్లె, చాపాడు మండలం

ఎన్జీఓహోంలో కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వైవీ రామమునిరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఎన్జీఓహోంలో ఆదివారం కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 52 మంది ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. 10 మందికి ఆపరేషన్ అవసరమవుతుందని కంటి వైద్యుడు వైవీ రామమునిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎన్జీఓ అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.